



ఇంటింటికీ గణనాథుడి మట్టి ప్రతిమలు

- సచివాలయానికి 1000 చొప్పున పంపిణీ
- విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ తదితరులు

ఎంవీపీ కాలనీ: వినాయక చవితిని పురస్కరించుకుని తూర్పు నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి మట్టి ప్రతిమలు పంపిణీ చేయనున్నట్టు విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయ ణ తెలిపారు. శుక్రవారం లాసన్స్‌బే కాలనీలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంట్లోను పర్యావరణహిత వినాయక చతుర్ధి జరుపుకోవాలనే లక్ష్యంతో మట్టి వినాయకుడి ప్రతిమల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. నియోజవరగంలోని 92 సచివాలయాల పరిధిలో వెయ్యి చొప్పున 92 వేల ప్రతిమలను మూడు బృందాలు పంపిణీ చేయనున్నాయన్నారు. చవితి విశిష్టత, వ్రతం తెలియజేసే పుస్తకాన్ని కూడా అందిస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



శంకర్

బీచ్ రోడ్డు: ఒక వ్యక్తి అదృశ్యమైన ఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. చిన్నవాల్తేరులోని ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న యల కుమారి కుమారుడు శంకర్(25) కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 11న ఉదయం కూలీ పని కోసం వెళ్లిన శంకర్ రాత్రికి ఇంటికి చేరుకోలేదు. మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో తల్లి కుమారి ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ఏయూ క్యాంపస్: విద్యార్థులు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా, ఆవిష్కర్తలుగా ఎదగాల్సిన అవసరం ఉందని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. శుక్రవారం ఏయూ టీఎల్ఎన్ సమావేశ మందిరంలో రెండు రోజుల పాటు జరిగే విశాఖ లైఫ్ సైన్సెస్–ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్–2023 కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ జీవశాస్త్ర రంగాలలో నూతన అవకాశాలు విస్తృతం అవుతున్నాయన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ నవ్య ఆలోచనలతో పనిచేసే యువతకు అవసరమైన సహకారం అందించే దిశగా ఏయూలో స్టార్టప్ ఇంక్యుబేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం, సీసీటీబీ ఇన్‌స్టెమ్ డాక్టర్ కె.ఆనంది, టీకాబ్స్–ఈ వ్యవస్థాపకుడు డాక్టర్ రవికిరణ్ ఎస్.యేడిది, లైఫ్ సైన్స్ విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి



ఎంవీపీ రైతు బజార్‌లో మట్టి వినాయక విగ్రహాలతో మేయర్ గొలగాని, ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ: పర్యావరణ పరిరక్షణకు అంతా సహకరించా లని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, విశాఖ ఎంపీ, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ కోరారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో ఎంవీపీ రైతుబజార్‌లో శుక్రవారం వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. రైతుబజార్‌లో వినియోగదార్లు, రైతులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితికి ప్రజలు మట్టి ప్రతిమలకు పూజలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, జీవీఎంసీ అధికారులు, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ జి.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు సహకారం : ఆరిలోవ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా జీవీఎంసీ పదో వార్డు రవీంద్రనగర్‌లో శుక్రవారం మాజీ కార్పొరేటర్ జగ్గపిల్లి అప్పలరాజు నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ పాల్గొని పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అయ్యారకల కార్పొరేషన్ డైరెక్టర్ కె.ఆర్.రామన్న పాత్రుడు ఆధ్వర్యంలో ఎస్ఐజీ నగర్ ప్రాథమిక పాఠశాలలో 200 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్థానిక పేద వృద్ధులకు చీరలు అందజేశారు.

70 ఏళ్ల వృద్ధుడికి అరుదైన శస్త్రచికిత్స

ఎంవీపీ కాలనీ: ఓ వృద్ధుడికి మెడికవర్ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. వివరాలిలా ఉన్నాయి. 70 ఏళ్ల వృద్ధుడు కడుపునొప్పి కారణంగా ఇటీవల మెడికవర్ ఆస్పత్రికి వచ్చాడు. ఆయనను డాక్టర్ కార్తీక్ చంద్ర వల్లంతో కూడిన వైద్యుల బృందం పరీక్షించింది. సీటీ స్కాన్ చేయగా పొత్తికడుపులో రక్తస్రావం జరిగినట్లు గుర్తించారు. అనంతరం కాలేయంలో అతిపెద్ద రక్తనాళానికి పక్కనే క్యాన్సర్ కణితి ఉన్నట్లు గుర్తించి, శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. ప్రస్తుతం వృద్ధుడు పూర్తిస్థాయిలో కోలుకున్నట్లు వైద్యులు తెలిపారు.

ఆర్థికాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న వీసీ ప్రసాద రెడ్డి తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా ప్రారంభించారు. శుక్రవారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఇక్కడి ఇంజినీర్స్ కార్యాలయం వద్దనున్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశ ఆర్థిక అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, యూనివర్సిటీ ఇంజినీర్స్ కార్యాలయం డీన్ ఆచార్య వజీర్ మహమ్మద్, యూనివర్సిటీ ఇంజినీర్ ఆర్.శంకరరావు పాల్గొన్నారు.

సమావేశ మందిరం ప్రారంభం : ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో అభివృద్ధి చేసిన సమావేశ మందిరాన్ని ఏయూ వీసీ ప్రసాదరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సమావేశ మందిరాన్ని రూ.5 లక్షల వ్యయంతో పూర్వ విద్యార్థి కుమార్ రాజా ప్రాజెక్ట్స్ ఎండీ డాక్టర్ కుమార్ రాజా, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు తమ సొంత నిధులు వెచ్చించి తీర్చిదిద్దారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య సమావేశ మందిరంగా దీనికి నామకరణం చేశారు.

బీచ్ రోడ్డు: సిరిపురంలోని బిల్డర్స్ అసోసియేషన్ హాల్‌లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నేవీ చీఫ్ ఇంజినీర్ దినేష్ అగర్వాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఏఐ విశాఖపట్నం చైర్మన్ కె.వెంకటేశ్వర్లు, జాతీయ ఉపాధ్యక్షులు సీహెచ్ రామకోటయ్య, కె.కుమారరాజా, సుబ్బారావు పాల్గొన్నారు.

సంపూర్ణ వ్యక్తిత్వ వికాసమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం

ఏయూ క్యాంపస్: సంపూర్ణ వ్యక్తిత్వ వికాసమే జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) లక్ష్యమని, నూతన విద్య విధానంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని ఏయూ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకల్లో పాల్గొనే వలంటీర్ల ఎంపిక కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలు, సేవా కార్యక్రమాలకు సమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ పి.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ 2024 జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో జాతీయ సేవా పథకం నుంచి బాలికలే పాల్గొంటారని, దేశంలోని విభిన్న ప్రాంతాల నుంచి ఎంపికలు జరుగుతున్నాయన్నారు. ఈ సంవత్సరం వెస్ట్ జోన్ గణతంత్ర శిబిరం గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో జరుగుతుందన్నారు. ఎంపికైన ఐదుగురు విద్యార్థులు ఏయూ తరఫున పాల్గొంటారన్నారు. ఎన్ఎస్ఎస్ ఏపీ, తెలంగాణ అధికారి సైదా నాయక్, ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎస్.హరనాథ్, విశాఖ జిల్లా అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, ప్రోగ్రాం అధికారులు షేక్ మీరా, డాక్టర్ లక్ష్మీ నారాయణ, అనిత, పి.భాస్కరరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణ వారోత్సవాలు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆత్మహత్యల నివారణ వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. మానసిక ఆరోగ్య కార్యక్రమం సమన్వయకర్త జి.సాయిలక్ష్మి మాట్లాడుతూ టెలీమానస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యాంటీ ర్యాగింగ్ గురించి వివరించారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

ఆరిలోవ: మద్యం మత్తులో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రికి చెందిన దేవాడ రాము (50) ఇంట్లో గొడవ పడి నెల రోజుల క్రితం విశాఖపట్నం వచ్చాడు. కొద్ది రోజులు మద్దిలపాలెం, మధురవాడ ప్రాంతాల్లో ఉన్న బంధువుల ఇళ్లకు వెళ్లడం.. మిగతా రోజులు మద్యం తాగి బయట ఫుట్‌పాత్‌లపై తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మద్యం సేవించిన ఆయన హనుమంతవాక కూడలి వద్ద రోడ్డు పక్కన కాలువలో పడిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు ఆరిలోవ పోలీసులు వచ్చి, ఆయనను 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించగా దారిలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. రాజమండ్రి నుంచి కుటుంబ సభ్యులు వచ్చిన వెంటనే అతని మృతదేహాన్ని అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

తీరంలో 1500 కేజీల చాక్లెట్ వినాయకుడు

బీచ్ రోడ్డు: వినాయక చవితిని పురస్కరించుకుని సాగరతీరంలో ఈ నెల 18న 1500 కేజీల భారీ చాక్లెట్ వినాయకుడిని ఏర్పాటు చేయనున్నట్టు యూత్ ఐకాన్ అధ్యక్షుడు సీరపు రాజు అన్నారు. వినాయకుడి ఏర్పాటు స్థలం వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 14 అడుగుల వినాయకుడి విగ్రహానికి సుమారు రూ.30 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. 21 రోజుల పాటు ఉండేలా ఏసీ మండపాన్ని ప్రత్యేకంగా తయారు చేస్తున్నట్లు తెలిపారు.

భూమి, నీటి రక్షణకు బైక్ ర్యాలీ

బీచ్ రోడ్డు: సేవ్ వాటర్.. సేవ్ ఎర్త్ నినాదంతో బ్లూ ఫర్ గ్రీన్ పేరుతో డ్రాగన్ జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ విశాఖ నైట్స్, డ్రాగన్ ది క్లబ్ సంయుక్తంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఆర్కే బీచ్ వద్ద 27 బైకులతో చేపట్టిన ఈ ర్యాలీని డీజేసీ వ్యవస్థాపకుడు కిరణ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.









